63,000 దిగువకు పసిడి

న్యూఢిల్లీ, జనవరి 18: బంగారం మరింత దిగింది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు తగ్గుముఖం పట్టడంతో వరుసగా మూడోరోజు గురువారం రూ.63 వేల దిగువకు పడిపోయాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.300 తగ్గి రూ.62,750 వద్దకు చేరుకున్నాయి. అటు వెండి ధరలు కూడా రూ.200 తగ్గి రూ.75,600 వద్ద ముగిశాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 22 క్యారెట్ల తులం గోల్డ్ ధర రూ.300 దిగి రూ.57,700 నుంచి రూ.57,400కి దిగిరాగా, 24 క్యారెట్ల పదిగ్రాముల ధర రూ.330 తగ్గి రూ.62,620కి తగ్గింది. పసిడితోపాటు కిలో వెండి రూ.400 తగ్గి రూ.77 వేలకు పరిమితమైంది. అమెరికాలో రిటైల్ సేల్స్ డాటా అంచనాలకుమించి పెరగడం ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. యూఎస్ ఆర్థిక వ్యవస్థ బలపడుతున్నట్లు వచ్చిన సంకేతాలతో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లాయి.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభం 2,301 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 18: ప్రైవేట్ రంగ సంస్థ ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.2,301 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.1,964 కోట్ల కంటే 17 శాతం అధికం. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.11,534 కోట్ల నుంచి రూ.13,968 కోట్లకు పెరిగినట్లు బీఎస్ ఈకి సమాచారం అందించింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 2.06 శాతం నుంచి 1.92 శాతానికి దిగిరాగా, నికర ఎన్‌పీఏ 0.62 శాతం నుంచి 0.57 శాతానికి దిగొచ్చాయి.

హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా 2024 కార్యక్రమంలో ఫిక్కీ-కేపీఎంజీ నివేదికను విడుదల చేస్తున్న పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఆ శాఖ సహాయ మంత్రి వీకే సింగ్, తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు

ఏవియేషన్‌కు కిక్కు

జోరు మీదున్న దేశీయ విమానయాన సంస్థలు • బోయింగ్, ఎయిర్‌బస్‌లకు భారీగా గిరాకీ

గడిచిన ఏడాది కాలంలో 1,120 కొత్త ప్లేన్లకు ఆర్డర్లు

హైదరాబాద్, జనవరి 18 (బిజినెస్ బ్యూరో): దేశీయ విమానయాన సంస్థలు విస్తరణ బాట పట్టాయి. పెద్ద ఎత్తున కొత్త విమానాలకు ఆర్డర్లిస్తున్నాయి. దీంతో అటు బోయింగ్, ఇటు ఎయిర్‌బస్‌లకు గిరాకీ ఒక్కసారిగా పెరిగిపోయింది. కేవలం నెలల వ్యవధిలోనే ఏకంగా 1,120 ఆర్డర్లు అందుకున్నాయి మరి. ఆకాశ ఎయిర్ మొదలై రెండేండ్లు కూడా కాలేదు.. అప్పుడే మరో 150 కొత్త విమానాలు కావాలంటూ బోయింగ్‌తో ఒప్పందం చేసుకున్నది. హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 సందర్భంగా ఆకాశ ఎయిర్ ఈ మేరకు ప్రకటించింది. 737 మ్యాక్స్ 10, 737 మ్యాక్స్ 8-200 జెట్స్‌కు ఆర్డర్ ఇచ్చినట్టు వివరించింది. ఇప్పటికే 2021లో 72 బోయింగ్ 737 మ్యాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం, 2023 జూన్‌లో 4 బోయింగ్ 737 మ్యాక్స్ 8 ఎయిర్‌క్రాఫ్ట్‌ల కోసం ఆకాశ ఎయిర్ ఆర్డర్లు ఇచ్చింది. దీంతో మొత్తం ఆర్డర్లు 226కు చేరుకున్నట్టు సంస్థ వ్యవస్థాపక సీఈవో వినయ్ దూబే గురువారం తెలిపారు. ఇందులో 22 విమానాలను అందుకున్నామన్న ఆయన.. వచ్చే ఎనిమిదేండ్లలో మిగతా 204 విమానాలను పొందనున్నట్టు చెప్పారు. ఇక ఒకేసారి 150 విమానాల ఆర్డర్ ఇవ్వడంతో ఇప్పటిదాకా ప్రపంచ విమానయాన రంగంలో నమోదైన భారీ ఆర్డర్లలో తమది కూడా ఒకటైనట్టు దూబే పేర్కొన్నారు. కాగా, 2022 ఆగస్టు 7న ఆకాశ ఎయిర్ విమాన యాన సేవలు మొదలైన విషయం తెలిసిందే.

గత ఏడాది 970 విమానాల ఆర్డర్లు

ఎయిర్ ఇండియా, ఇండిగో సంస్థలు గత ఏడాది 970 విమానాల కోసం బోయింగ్‌కు, ఎయిర్‌బస్‌కు ఆర్డర్లిచ్చిన సంగతి విదితమే. కేంద్ర ప్రభుత్వం నుంచి టాటాలు సొంతం చేసుకున్న ఎయిర్ ఇండియా.. 470 కొత్త విమానాల ఆర్డర్లిచ్చింది. ఎయిర్‌బస్‌కు 250, బోయింగ్‌కు 220 విమానాలు కావాలంటూ నిరుడు ఫిబ్రవరిలో చెప్పింది. అలాగే గత ఏడాది జూన్‌లో భారతీయ విమానయాన దిగ్గజం ఇండిగో సైతం ఎయిర్‌బస్‌కు 500 నారో-బాడీ ప్లేన్ల తయారీకి ఆర్డర్ ఇచ్చింది. ఈ క్రమంలో ఇప్పుడు ఆకాశ ఎయిర్ 150 ప్లేన్ల ఆర్డర్.. మొత్తం 11 నెలల్లో భారతీయ విమానయాన సంస్థల నుంచి వెళ్లిన ఆర్డర్లను 1,120కి చేర్చింది. కాగా, ఇండిగోకు కొత్తగా అందాల్సిన విమానాల సంఖ్యే దాదాపు వెయ్యిగా ఉండటం గమనార్హం. ఇక నిరుడు మే నెల నుంచి విమానయాన సేవలకు దూరమైన గో ఫస్ట్ సంస్థ సైతం గతంలో 72 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. ఏదేమైనా వచ్చే కొన్నేండ్లలో దేశీయ విమానయాన సంస్థల్లోకి 1,600లకుపైగా కొత్త ఎయిర్‌క్రాఫ్ట్‌లు రానున్నాయి. ప్రస్తుతం దేశంలోని విమానయాన సంస్థలన్నింటికి కలిపి 730 ఎయిర్‌క్రాఫ్ట్‌లున్నాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పౌర విమానయాన మార్కెట్లలో భారత్ కూడా ఒకటన్నది విదితమే.

పైలెట్ శిక్షణ కేంద్రం..

టాటా గ్రూపునకు చెందిన ఎయిర్ ఇండియాతో కలిసి గురుగ్రామ్‌లో పైలెట్ల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు ఎయిర్‌బస్ ప్రకటించింది. జాయింట్ వెంచర్‌లో ఏర్పాటు కానున్న ఈశిక్షణ కేంద్రంలో ఇరు సంస్థలకు సగం వాటా ఉండనున్నది. ఇప్పటికే జీఎమ్మార్ ఏరో టెక్నిక్‌తో కలిసి విమానాల నిర్వహణ, ఇంజినీరింగ్ శిక్షణ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. 3,300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ సెంటర్‌లో 10 ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్స్(ఎఫ్ఎఫ్ఎస్), ఫ్లైట్ శిక్షణ క్లాస్‌రూం నెలకొల్పబోతున్నది. వచ్చే ఏడాది తొలి నెలలోనే ఈ శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది. వచ్చే పదేండ్లలో కొత్తగా 5 వేల మంది పైలెట్లు అవసరం ఉంటుంది.

2,840 విమానాలు..

41 వేల పైలట్లు

దేశీయ డిమాండ్‌పై ఎయిర్‌బస్ ఇండియా అంచనా

హైదరాబాద్, జనవరి 18: భారత్‌లో వచ్చే 20 ఏండ్ల కాలంలో భారత్‌లో 2,840 నూతన విమానాలకు డిమాండ్ ఉంటుందని ఎయిర్‌బస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్, ఎండీ రోమి మైలార్డ్ తెలిపారు. అలాగే 41 వేల మంది విమాన చోదకులు, 47 వేల మంది టెక్నికల్ స్టాఫ్ అవసరమవుతారని హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 సదస్సులో చెప్పారు. ప్రస్తుతం భారత్ నుంచి ప్రతియేటా 750 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుండగా, వచ్చే దశాబ్దం తర్వాత ఇది రెండింతలు పెరిగి 1.5 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశాలు మెండుగావున్నాయన్నారు. గతేడాది ఎయిర్‌బస్‌కు ఇండియా నుంచి 750 విమానాల ఆర్డర్లు రాగా, వీటిలో 75 విమానాలను సరఫరా చేసింది. వీటిలో 41 ఇండిగోకు సరఫరా చేసిన సంస్థ..ఎయిర్ ఇండియాకు 19, విస్తారాకు 14, గోఫస్ట్‌కు ఒక్క సర్వీసును అందించింది. అంతర్జాతీయ విమానయాన రంగంలో భారత్ దూసుకుపోతున్నదని, అమెరికా, చైనాల తర్వాత మూడో అతిపెద్ద విమాన సేవలు అందిస్తున్న దేశంగా కొనసాగుతున్నదని చెప్పారు.

30 కోట్లకు ప్రయాణికులు: సింధియా

భారత్‌లో విమాన ప్రయాణికుల సంఖ్య నానాటికి పెరుగుతున్నారు. 2023లో 15.3 కోట్ల మంది దేశీయంగా ప్రయాణించగా, 2030 నాటికి ఈ సంఖ్య 30 కోట్లకు చేరుకునే అవకాశాలున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. హైదరాబాద్‌లో వింగ్స్ ఇండియా 2024ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. విమాన ప్రయాణికులకు అనుగుణంగా విమానాశ్రయాలు, వాటర్‌డ్రోమ్స్‌ల సంఖ్యను 149 నుంచి 200కి పైగా పెంచడం జరిగిందని, దేశీయ విమానయాన రంగం ప్రతియేటా 10 శాతం నుంచి 15 శాతం వృద్ధి చెందుతున్నదన్నారు. విమానయాన రంగంలో ఒక్క ఉద్యోగ కల్పనతో పరోక్షంగా ఆరుగురికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్న మంత్రి..అంతర్జాతీయంగా విమానయాన రంగం 6.1 శాతం వృద్ధిని నమోదు చేసుకుంటున్నదన్నారు. భారత్‌లో విమానాలు వాడేవారి సంఖ్య కేవలం 3 నుంచి 4 శాతం మధ్యలోనే ఉన్నదని, ఇది 10 శాతం నుంచి 15 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. అలాగే సరుకు రవాణాలో వృద్ధి 60 శాతంగా ఉండగా, అంతర్జాతీయ రూట్లలో 53 శాతంగా ఉందన్నారు. విమాన సర్వీసుల సంఖ్య 400 నుంచి 700కి పెరగగా, వచ్చే పదేండ్లలో ఈ సంఖ్య 2 వేలకు చేరుకునేదానిపై మంత్రి ధీమా వ్యక్తంచేశారు. ఇందుకోసం కొత్తగా మరో 50 విమానాశ్రయాలను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు అంటే 65 ఏండ్లలో కేవలం 74 విమానాశ్రయాలు నిర్మితమవగా, గత పదేండ్లలో అదనంగా 75 ఎయిర్‌పోర్ట్‌లను నిర్మించినట్లు మంత్రి చెప్పారు.

జీఎమ్మార్ ఏవియేషన్ స్కూల్

ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన మంత్రి సింధియా

గురువారం బెంగళూరులోని ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద ఈ ఏడాదికిగాను ఫామింగ్ టెక్నాలజీపై అంతర్జాతీయ సెమినార్ జరిగింది. ఇందులో భారత్‌సహా జర్మనీ, ఇటలీ, జపాన్, స్వీడన్ దేశాలకు చెందిన ప్రముఖ ఫామింగ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైదరాబాద్, జనవరి 18: జీఎమ్మార్ ఏవియేషన్ స్కూల్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ప్రారంభించారు. గురువారం ఇక్కడ మొదలైన వింగ్స్ ఇండియా 2024కు హాజరైన ఆయన ఆన్‌లైన్‌లో ఈ స్కూల్‌ను లాంచ్ చేశారు. ఎయిర్‌బస్ సహకారంతో జీఎమ్మార్ దీన్ని తీసుకురాగా.. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్దనున్న జీఎమ్మార్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఏర్పాటైంది. ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏఎంఈ)లో ఈ స్కూల్ అత్యుత్తమంగా నిలుస్తుందన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో జీఎమ్మార్ వ్యక్తం చేసింది. కాగా, ఇందులో 4 ఏండ్ల ఏఎంఈ కోర్సు ఉంటుంది. దీనికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ (ఈఏఎస్ఏ)ల గుర్తింపున్నది. అంతేగాక దేశంలో బీ1.1, బీ2 ఏఎంఈ లైసెన్సింగ్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ఇనిస్టిట్యూషన్ కూడా ఇదేనని జీఎమ్మార్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు అశోక్ గోపీనాథ్ తెలిపారు. ఇక్కడ ఎయిర్‌క్రాఫ్ట్ స్పెసిఫిక్ టైప్ ట్రైనింగ్ కోర్సులతోపాటు ఎయిర్‌క్రాఫ్ట్ స్ట్రక్చర్స్, ఎయిర్‌క్రాఫ్ట్ కాంపోజిట్ కోర్సుల వంటి పాత తరం కోర్సులనూ అందిస్తారు. ఇందుకు సంబంధించిన శాస్త్ర, సాంకేతికతను పుస్తకాల రూపంలో ఎయిర్‌బస్ అందిస్తుంది. అలాగే ఎయిర్‌బస్ కాంపిటెన్స్ ట్రైనింగ్ (యాక్ట్)కు వీలుగా ఎగ్జామినేషన్ డాటాబేస్‌నూ కల్పిస్తుంది.

జీఎమ్మార్-ఇండిగో జట్టు

భారతీయ విమానయాన పరిశ్రమకు కొత్త రూపును తెచ్చేలా వ్యూహాత్మకంగా ఓ డిజిటల్ కన్సార్టియంను జీఎమ్మార్ గ్రూప్, ఇండిగో ఎయిర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నాయి. ఈ మేరకు ఇరు సంస్థలు ఇక్కడ ప్రకటించాయి. కటింగ్-ఎడ్జ్ టెక్నాలజీలు, ప్యాసింజర్ ఎక్స్‌పీరియన్సెస్, యావత్తు ఇండస్ట్రీ స్థిరత్వంపై ఈ కన్సార్టియం ప్రధానంగా దృష్టి పెట్టనున్నది. పరిశ్రమలో ఇన్నోవేషన్‌కు తొలి ప్రాధాన్యతనిస్తున్నామని, ఆ దిశగానే అడుగులు వేస్తున్నామని జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎస్‌జీకే కిశోర్ ఈ సందర్భంగా తెలిపారు. భవిష్యత్తు తరాల సాంకేతికతను అందిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వివరించారు.

యాక్సెంచర్ టాప్ ఐటీ బ్రాండ్

ద్వితీయ, తృతీయ స్థానాల్లో టీసీఎస్, ఇన్ఫీ

న్యూఢిల్లీ, జనవరి 18: కొత్త టెక్నాలజీలు ఆవిర్భవిస్తున్నా, వృద్ధి మందకొడిగా ఉన్నా ప్రపంచ ఐటీ పరిశ్రమలో ఆధిపత్యం చెలాయిస్తూ బ్రాండ్ వాల్యూను పెంచుకుంటున్న టాప్ త్రీలో యాక్సెంచర్, టీసీఎస్, ఇన్ఫోసిస్‌లు చోటుచేసుకున్నాయి. తాజాగా విడుదలైన బ్రాండ్ ఫైనాన్స్ 2024 రిపోర్ట్ ప్రకారం 40.5 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో యాక్సెంచర్ ప్రపంచంలో అత్యంత విలువైన ఐటీ సర్వీసుల బ్రాండ్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నది. ఈ కంపెనీ బ్రాండ్ విలువ గత ఏడాదికంటే 1.6 శాతం పెరిగింది. ఐర్లాండ్‌లోని డబ్లిన్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న యాక్సెంచర్‌కు భారత్‌లో హైదరాబాద్‌తో సహా పలు నగరాల్లో కార్యాలయాలు ఉన్నాయి. భారత్‌లోనే ఈ కంపెనీకి 3 లక్షలమేర ఉద్యోగులున్నారు. దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ 19.2 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో టాప్-బ్రాండ్స్ లిస్ట్‌లో ద్వితీయస్థానంలో ఉన్నది. జాబితాలో అన్నింటికంటే అధికంగా బ్రాండ్ విలువను ఏడాదిలో 2 బిలియన్ డాలర్ల (11 శాతం వృద్ధి) మేర ఇది పెంచుకుంది. పలు వృద్ధి విభాగాల్లో తాము చేసిన పెట్టుబడుల కారణంగా బ్రాండ్ విలువ పెరిగిందని రిపోర్ట్‌లో పేర్కొన్నారు. మరో దేశీ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ 14.2 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో మూడో ర్యాంక్‌లో కొనసాగింది. అలాగే ఇన్ఫీ సీఈవో సలీల్ పరేఖ్ 2024 సంవత్సరానికి నంబర్ ఒన్ ఐటీ సర్వీసుల సీఈవోగా గుర్తింపు పొందారు. భారత్‌లో మూడో పెద్ద ఐటీ కంపెనీ అయిన హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 6.5 బిలియన్ డాలర్ల బ్రాండ్ విలువతో 8వ స్థానంలో ఉన్నది. బ్రాండ్ విలువను వేగంగా 16 శాతం వృద్ధిపర్చుకున్న కంపెనీ ఇదేకావడం గమనార్హం. అజీం ప్రేమ్‌జీ ప్రమోట్ చేసిన విప్రో బ్రాండ్ విలువ మాత్రం 7.6 శాతం తగ్గింది. వ్యాపారాన్ని టర్న్ ఎరౌండ్ చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్న విప్రో నుంచి 2023లో పలువురు సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు వైదొలిగారు.

టాప్ టెన్ ఐటీ బ్రాండ్స్

ర్యాంక్	కంపెనీ	బ్రాండ్ విలువ (బిలియన్ డాలర్లలో)
1	యాక్సెంచర్	40.50
2	టీసీఎస్	19.16
3	ఇన్ఫోసిస్	14.04
4	ఐబీఎం కన్సల్టింగ్	12.10
5	క్యాప్ జెమిని	10.21
6	ఎన్‌టీటీ డాటా	8.93
7	కాగ్నిజెంట్	8.64
8	హెచ్‌సీఎల్ టెక్	7.57
9	విప్రో	5.76
10	పుజిట్సు ఐటీ	4.33

హైదరాబాద్‌లో ఎల్ఎస్ఈజీ టెక్నాలజీ సెంటర్

హైదరాబాద్, జనవరి 18: లండన్ స్టాక్ ఎక్స్చేంజ్ గ్రూప్(ఎల్ఎస్ఈజీ)..హైదరాబాద్‌లో టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్ర ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్ గతేడాది లండన్ పర్యటనలో భాగంగా కుదిరిన ఒప్పందం ప్రకారం సంస్థ..అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా ఇక్కడ నూతన టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. వచ్చే ఏడాది చివరినాటికి ఈ సెంటర్ కోసం వెయ్యి మంది ఇంజినీర్లు, ప్రొఫెషనర్లను నియమించుకోనున్నట్టు ఎల్ఎస్ఈజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారి ఇర్ఫాన్ తెలిపారు. కస్టమర్లకు అధునాతన ఉత్పత్తులను అందించడానికి సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగా నూతన ఏర్పాటు చేసిన సెంటర్‌లో టెక్నాలజీ రంగంలో మంచి పట్టున్న సిబ్బందిని నియమించుకుంటున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం హైటెక్ సిటీలో నెలకొల్పిన సెంటర్‌లో ప్రస్తుతం 300 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

మార్కెట్లకు హెచ్‌డీఎఫ్‌సీ దెబ్బ

ముంబై, జనవరి 18: రికార్డుస్థాయి నుంచి మొదలైన మార్కెట్ పతనం వరుసగా మూడో రోజైన గురువారం సైతం కొనసాగింది. బీఎస్ఈ సెన్సెక్స్ మరో 315 పాయింట్ల నష్టాన్ని మూటకట్టుకుని 71,187 పాయింట్ల వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 110 పాయింట్లు కోల్పోయి 21,462 పాయింట్ల వద్ద నిలిచింది. ట్రేడింగ్ తొలిదశలో సెన్సెక్స్ 835 పాయింట్లు పతనమై 70,665 పాయింట్ల కనిష్ఠస్థాయిని తాకగా, నిఫ్టీ 286 పాయింట్లు పడిపోయి 21,285 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని చూసింది. అయితే మధ్యాహ్న సెషన్ తర్వాత రిలయన్స్, సన్‌ఫార్మా, ఎల్ అండ్ టీలతోపాటు కొన్ని ఐటీ షేర్లలో షార్ట్ కవరింగ్ జరగడంతో సూచీలు నష్టాల్ని పరిమితం చేసుకున్నాయి. మొత్తం మూడు రోజుల్లో సెన్సెక్స్ 2,141 పాయింట్లు, నిఫ్టీ 635 పాయింట్ల చొప్పున కోల్పోయాయి. ఇంట్రాడే కనిష్ఠ నుంచి సూచీలు కోలుకున్నా, బలహీన గ్లోబల్ సంకేతాల కారణంగా నష్టాలతో ముగిసాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. యూఎస్‌లో రిటైల్ అమ్మకాలు జోరుగా ఉన్నట్టు డాటా వెలువడటం, గ్లోబల్ బాండ్ ఈల్డ్స్ పెరగడంతో ఫెడ్ వడ్డీ రేట్లు త్వరితంగా తగ్గబోవన్నఅంచనాల్ని ఇన్వెస్టర్లు ఏర్పర్చుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్లో కొన్ని రంగాల షేర్లను విక్రయించి, మరికొన్నింటిలో కొనుగోళ్లు జరుపుతున్నారని వివరించారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టాప్ లూజర్

కీలకమైన ప్రధాన షేర్లు లాభాల్లోకి మళ్లినప్పటికీ, సూచీల నష్టాల ముగింపునకు ప్రధాన కారణం త్రైమాసిక ఫలితాలతో ఇన్వెస్టర్లను నిరాశపర్చిన హెవీవెయిట్ షేరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కావడం గమనార్హం. దాదాపు 15 శాతం వెయిటేజీ ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సెన్సెక్స్‌లో 305 పాయింట్లను నష్టపర్చింది. బుధవారం 8 శాతం తగ్గిన ఈ షేరు తాజాగా మరో 3.26 శాతం నష్టాన్ని చవిచూసింది. ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్, పవర్ గ్రిడ్, టైటాన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లే, మారుతిలు 1-2 శాతం మధ్య క్షీణించాయి. మరోవైపు రిలయన్స్ ఇండస్ట్రీస్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, లార్సన్ అండ్ టూబ్రోలు 1-2 శాతం మేర పెరిగాయి. వివిధ రంగాల సూచీల్లో అధికంగా కన్జూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 2.07 శాతం తగ్గింది. యుటిలిటీస్ 1.70 శాతం, పవర్ 1.30 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.82 శాతం చొప్పున క్షీణించాయి. ఎనర్జీ, హెల్త్‌కేర్, టెలికమ్యూనికేషన్స్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు పెరిగాయి.

కన్సాలిడేషన్‌కు అవకాశం

మూడు రోజుల్లో జరిగిన భారీ పతనం కారణంగా ఒకటి, రెండు రోజులు నిఫ్టీ పరిమితశ్రేణిలో కన్సాలిడేట్ కావచ్చని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అంచనా వేశారు. 21,700-21,850 స్థాయికి పెరిగితే అమ్మకాలు వెల్లువెత్తవచ్చని, నిఫ్టీకి తదుపరి కీలక మద్దతు 21,200 సమీపంలో ఉన్నదని విశ్లేషించారు.

ఎఫ్‌పీఐల విక్రయాలు రూ.20వేల కోట్లు

వరుసగా రెండు రోజుల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారీగా రూ. 20,000 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. బుధవారం రూ. 10,578 కోట్ల వెనక్కు తీసుకున్న ఎఫ్‌పీఐలు గురువారం మరో రూ. 9,900 కోట్ల విలువైన షేర్లను ఆఫ్‌లోడ్ చేశారు.

ఆభరణాల ఎగుమతులు డౌన్

ముంబై, జనవరి 18: బంగారు ఆభరణాల ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. డిసెంబర్ నెలలో రూ.18,281.49 కోట్లు(2,195.23 మిలియన్ డాలర్లు) విలువైన జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ ఎగుమతి అయ్యాయని జెమ్ జ్యూవెల్లరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్(జీజేఈపీసీ) వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఎగుమతైన రూ.19,901.55 కోట్లు(2,413.46 మిలియన్ డాలర్లు) తో పోలిస్తే 8 శాతం తగ్గినట్టు పేర్కొంది. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, ముఖ్యంగా యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో అభరణాలకు డిమాండ్ పడిపోయిందని, 60 దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరుగుతుండటం కూడా ఇందుకు కారణమని జీజేఈపీసీ చైర్మన్ విపుల్ షా తెలిపారు. అలాగే కట్, డైమండ్స్‌ల ఎగుమతులు కూడా ఏడాది ప్రాతిపదికన 31.42 శాతం తగ్గి రూ.7,182.53 కోట్లకు పడిపోయాయి. కానీ, పసిడి ఆభరణాల ఎగుమతులు 47.32 శాతం ఎగబాకి రూ.7,508.05 కోట్లకు చేరుకున్నాయి.

అమ్మకానికి ఎన్‌హెచ్‌పీసీ వాటా

ప్రారంభమైన ఓఎఫ్ఎస్ • ఖజానాకు రూ. 2,000 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 18: ప్రభుత్వ రంగ హైడ్రో పవర్ కంపెనీ ఎన్‌హెచ్‌పీసీలో 3.5 శాతం వాటాను (35 కోట్ల షేర్లు) కేంద్రం అమ్మకానికి పెట్టింది. షేరుకు రూ.66 ధర ఫ్లోర్‌ప్రైస్‌గా నిర్ణయించిన ఈ ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) గురువారం ప్రారంభమైంది. ఓఎఫ్ఎస్ ద్వారా 2.5 శాతం వాటాను (25.11 కోట్ల షేర్లు) విక్రయించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ. 2,000 కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఓవర్‌సబ్‌స్క్రిప్షన్ అయితే మరో 1 శాతం వాటాను (10 కోట్ల షేర్లు) ఆఫ్‌లోడ్ చేయనున్నట్టు ప్రకటించింది. తొలిరోజునే సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించిందని, 4.03 రెట్లు ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యిందని, దీంతో తాము ప్రతిపాదించిన అదనపు వాటాను కూడా విక్రయించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఎక్స్‌పోస్టులో తెలిపారు. రెండు రోజులపాటు కొనసాగే ఈ ఆఫర్‌లో తొలిరోజున సంస్థాగత ఇన్వెస్టర్లు, రెండోరోజైన శుక్రవారం రిటైల్, హైనెట్‌వర్త్ ఇన్వెస్టర్లు పాలుపంచుకోవచ్చు. ఆఫర్‌లో 25 శాతం మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలకు, 10 శాతం రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేశారు. ప్రస్తుతం కేంద్రానికి ఎన్‌హెచ్‌పీసీలో 71 శాతం వాటా ఉన్నది. ఓఎఫ్ఎస్ ఫ్లోర్ ధరను డిస్కౌంట్‌తో నిర్ణయించిన నేపథ్యంలో గురువారం ఎన్‌హెచ్‌పీసీ షేరు 3 శాతంపైగా క్షీణించి రూ.70.70 వద్ద ముగిసింది.

డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా 10 వేల కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకూ ప్రభుత్వ రంగ సంస్థల వాటా విక్రయం ద్వారా కేంద్రం రూ. 10,000 కోట్ల మేర నిధుల్ని సమీకరించింది. మార్కెట్ జోరును ఆసరా చేసుకుని ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో కోల్ ఇండియా, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, హడ్కో, ఇర్కాన్ ఇంటర్నేషనల్, రైల్ వికాస్ నిగమ్, ఎన్‌జేపీఎన్